క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలు అనుబంధ విభాగాల పదవుల్లో పలువురిని నియమిస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

తాడికొండ నియోజకవర్గంలో...

తాడికొండ నియోజకవర్గం తాడికొండ మండలం వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడిగా బెజ్జం సాయిప్రసాద్‌ను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని బాపూజీ నగర్, ఉడా కాలనీ, శిబిరంలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహస్వామి దివ్య రథోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం దివ్య రథోత్సవంలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, కోలాటం, నృత్యాలు, మేళతాళాల వంటి ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రేపు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 27 తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రకటనలో కోరారు.

తిరునాళ్లలో టీడీపీ కార్యకర్తల రాజకీయ నినాదాలు

మండిపడ్డ భక్తులు

మంగళగిరి: మంగళగిరిలో సోమవారం జరిగిన తిరునాళ్లలో టీడీపీ కార్యకర్తలు రాజకీయ నినాదాలు చేయడంపై భక్తులు మండిపడ్డారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన దివ్య రథోత్సవంలో పాల్గొనేందుకు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్‌లు ఆలయం వద్దకు చేరుకున్నారు. టీడీపీ కార్యకర్తలు జై లోకేష్, జై టీడీపీ, జై పెమ్మసాని అంటూ రథం ముందు నిలబడి నినాదాలు చేయడంతో ఒక్కసారిగా అక్కడ వాతావరణం మారిపోయింది. దేవుడి సేవకు వచ్చి రాజకీయ నినాదాలు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొబ్బరికాయ కొట్టిన లోకేష్ కార్యకర్తలతో సెల్ఫీలు దిగుతూ కార్యకర్తలను హత్తుకుంటూ సామాన్య భక్తులను ఇబ్బంది పెట్టడంతో భక్తులు లోకేష్, పెమ్మసానిలు దేవుడి దర్శనానికి వచ్చారా ఇక్కడ ప్రచారానికి వచ్చారా అంటూ మండిపడ్డారు.

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వినతి

తెనాలి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ని పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబై) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు నియమావళిని ఉల్లంఘించరాదని, విద్యార్థి, యువజన సంఘాలు సభలు, సమావేశాలకు, ప్రదర్శనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజల రక్షణకోసం తమ కౌన్సిల్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. వీరితో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ నన్నపనేని సునీల్‌కుమార్, కమిటీ సభ్యులు ఎం.మణికంఠ, ఎం.లిఖిత్, కె.ఫణికుమార్, శివశ్యాం, చరణ్ ఉన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, ఎమ్మెల్సీ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల



కుండలతో అన్నకుంభం తెస్తున్న భక్తులు



లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దివ్య రథోత్సవం పురస్కరించుకుని ఆలయ గాలిగోపురం వద్ద భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు - మంగళగిరి

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

మజ్జిగ, పానకం, తాగునీరు, అల్పాహారం అందజేసిన వివిధ సంస్థలు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహస్వామి దివ్య రథోత్సవం సందర్భంగా వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ, పానకం, పులిహోర, అల్పాహారాలను అందజేశారు. పద్మజ్యోతి సేవా సంఘం ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మురుగుడు సత్యం, కొల్లి వాసు, పద్మజ్యోతి సంఘం సభ్యులు పాల్గొన్నారు. మాతృ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పానకం, మజ్జిగ, ఐస్ క్రీమ్‌లు పంపిణీ చేశారు. నగరంలోని ఆయా ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలు భక్తులకు మజ్జిగ, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేశారు.



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కమల

వైద్య శిబిరం ఏర్పాటు..

నృసింహస్వామి దివ్య రథోత్సవం సందర్భంగా ఇందిరానగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మందులు, ప్రథమ చికిత్స అందించినట్లు హెల్త్ సెంటర్ డాక్టర్ పి.అనూష తెలిపారు.

ఆనందాల కేళీ.. హోలీ



ఫిరంగిపురం: మండలకేంద్రంలో(పాల్గుణ పౌర్ణమిని) హోలీ పండుగను ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వాసులు సోమవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాలనుంచి వలస వచ్చిన 20కుటుంబాల వారు ఇక్కడ మిఠాయి, టీ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. హోలీ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులను చల్లుకున్నారు. పాటలు పాడుతూ నాట్యాలు చేశారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. జావర్‌యాదవ్, ప్రతాప్,లక్ష్మణ్ యాదవ్, జీతు, రమేష్, సోనూ, మంగళ్‌సింగ్, సురేష్ యాదవ్, , గోపాల్ సింగ్, కాళియాయాదవ్‌లు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్య పరచాలి

తుళ్లూరు ఎంపీడీఓ బి.శ్రీమన్నారాయణ

తాడికొండ: ఓటర్లను చైతన్య పరచడం ద్వారా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని తుళ్లూరు ఎంపీడీఓ బి.శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్యపరచడం మరియు భాగస్వామ్యం అనే కార్యక్రమంలో భాగంగా తుళ్లూరు మండల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో రంగవల్లులను వేసి ఓటర్ల చైతన్యంపై అవగాహన కల్పించేలా పలువురు ముగ్గులు వేసి అలంకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణంలో ఓటరును భాగస్వాములను చేయడం ద్వారానే సమర్థవంతమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేయవచ్చని, అందుకు యువతను భాగస్వామ్యం చేసి విశేష ప్రచారం చేయడం ద్వారా అవగాహన కల్పించవచ్చు అన్నారు. కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెదపరిమిలో ఓటర్ల చైతన్య అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

తాడికొండ: ఎన్నికల విధుల నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని తాడికొండ తహసీల్దార్ మధుసూధనరావు సూచించారు. సోమవారం వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం అధికారులు పనిచేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఎక్కడైనా బ్యానర్లు, పార్టీ కార్యకలాపాలు జరిగితే వెంటనే రిటర్నింగ్ ఆఫీసర్, లేదా తమ దృష్టికి తీసుకొచ్చి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు తమ శాఖ సహకారం అవసరమని, గ్రామాల్లో పార్టీలకతీతంగా అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలంటే మంచి పరిస్థితులు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలీసు శాఖ, పంచాయతీరాజ్ శాఖ సహకారంతో మండలంలో ఎన్నికల విధుల్లో లోపం లేకుండా ముందుకు నడవాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉంటూ రెవెన్యూ పనులను పక్కన పెడితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారు కనుక ఎక్కడా అలసత్వం లేకుండా నిస్వార్థ సేవలు అందించి మంచి పేరు తీసుకు రావాలన్నారు. డీటీ కాకుమాను ప్రసాద్, ఆర్ఐ వంశీకృష్ణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చైతన్య మహాప్రభువు ఆవిర్భావ దినోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి వున్న ఇస్కాన్ రాధా శ్యామ్ సుందర్ మందిరంలో హరినామ సంకీర్తనను ప్రబోధించిన చైతన్య మహాప్రభువు ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షుడు చక్రధారి దాసు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా చైతన్య మహాప్రభువుగా అవతరించి, కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనను ప్రబోధించిన ఆ మహాప్రభువు యొక్క ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉదయం 4.30 గంటలకు మంగళ హారతి, అనంతరం శంఖాభిషేకం , చైతన్య లీలల ఆధారంగా లఘు నాటిక, మధురమైన కీర్తనలు, భజములు, ప్రవచనాలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 108 రకాల పిండి వంటలతో భోగ మరియు మహా హారతి స్వామివారికి సమర్పించామని అన్నారు. ఉండవల్లిలో భక్తులు నగర సంకీర్తనలో పాల్గొని, పుస్తకాలను పంపిణీ చేశారని, రాధాశ్యామ్ సుందర్ మందిరంలో గోశాల పరిక్రమ మార్గం, తులసి పరిక్రమ మార్గములు ప్రారంభించబడ్డాయని తెలిపారు.



రాధాశ్యామ్ విగ్రహాలకు హారతి ఇస్తున్న మందిర అధ్యక్షులు చక్రధారి దాసు

ఏప్రిల్ 1 నుంచి పరిశుద్ధ సమాజ కూడికలు

తెనాలిఅర్బన్: ఫిలదెల్ఫియా చర్చి ఆధ్వర్యంలో ఏప్రిల్ 1, 3 తేదీల్లో పరిశుద్ధ సమాజ కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ సీహెచ్ నతానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని కొలకలూరు మత్తయ్య హాస్టల్ ఆవరణలో ప్రతిరోజు రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. సభల్లో విజయవాడకు చెందిన బ్రదర్ సీహెచ్ డేవిడ్ బ్రెన్‌హాం, ధరణికోటకు చెందిన బ్రదర్ రేనాల్డ్స్ బాబులు వాక్యపరిచర్య చేస్తారని చెప్పారు.

విద్యార్థులు సమాజసేవ అలవర్చుకోవాలి

కేఎల్‌యూ డీన్ డాక్టర్ సిహెచ్ హనుమంతరావు

తాడేపల్లిరూరల్ : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే సమాజ సేవను అలవర్చుకోవాలని కేఎల్‌యూ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు సోమవారం అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్‌యూ ఫార్మసీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కొలనుకొండలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి గత వారంరోజులుగా సమాజ సేవ చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వలంటీర్లు వేసవి కాలంలో నీటిపొదుపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారని, విద్యుత్ వినియోగంపై సూచనలు చేశారని, ఫార్మసీ విద్యార్థులు ఇంటింటికి హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంపకంపైఅవగాహన కల్పించారని, వ్యవసాయ కూలీలకు, వీధి వ్యాపారులకు ఎండ తీవ్రత నుంచి ఎలా రక్షించుకోవాలో సూచనలు చేయడం జరిగిందని అన్నారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, వలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియలు అభినందించారు.



గ్రామస్తులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

గౌరారంగ ప్రభు జయంతి

తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్‌లోని కుసుమ హరనాథ మందిరంలో గౌరారంగ ప్రభు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిపారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.45 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్తోట యాదవపాలెంకు చెందిన భక్తులు హరేరామ-హరేకృష్ణ నామ సంకీర్తన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, మందిరం కమిటీ సభ్యులు సుజాత, మోహనరావు, భక్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మరీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు సోమవారం పట్టణంలోని చినరావూరుతోట, రామలింగేశ్వరపేట, నెహ్రూరోడ్డు, డిపో సెంటరు, బోస్‌రోడ్డులో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ఓటుని సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనమంతా జగనన్న వెంటే..

- కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగనన్నదే..
- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- అమీనాబాద్‌లో ఇంటింటి ప్రచారం

ఫిరంగిపురం: దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు వంటివని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో 3,4 వార్డుల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈసందర్భంగా సుచరిత మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. మధ్యవర్తులతో పనిలేకుండా అర్హులైతే చాలు పథకాలు అందేలా చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చేసి ప్రజల మనస్సులో నిలిచిపోయారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలన, ఆయన చూపిన బాటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, సయ్యద్ హబీబుల్లా, జి. చంద్రం, పాలపాటి రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, డి.నరేంద్రకుమార్, పి.చిన్న, బి.అంజిరెడ్డి, ఎ.రత్నం, కె.ఆనంద్, చంద్రశేఖరరెడ్డి, గాంధీబుడే, సుభాని, కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇస్మాయిల్, రఫీ, మీరా, కరిముల్లా, ఐజాక్, పి.నాగరాజు, బ్రహ్మారెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, కె.అప్పిరెడ్డి, టి.కృష్ణలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



అబ్దుల్ హుస్సేన్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

సొంత గూటికి అబ్దుల్ హుస్సేన్ ..

తాడికొండ: తాడికొండ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు మెంబర్ అబ్దుల్ హుస్సేన్ తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత హుస్సేన్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షుడు కలుగూరి నాగరాజు, మైనార్టీ నాయకులు షేక్ జానీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ జుబేర్, కందుల బాబు, ఉండవల్లి నరసింహారావు, శ్రీనివాసరావు, ఖలీల్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించం

- మరింత నిఘా ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేస్తాం
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ రాజకుమారి

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఘనియా తెలిపారు. సోమవారం 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో మంగళగిరిలో టీడీపీ నిబంధనల ఉల్లంఘనలపై కథనం ప్రచురితమైంది. పట్టణంలోని సీకే కళాశాలలో కలర్‌ఫుల్ ఎలక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజకుమారి దీనిపై స్పందించారు. సాక్షి దినపత్రికలో కథనాన్ని చూశామని, మరింత నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పత్రిక కథనంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, నారాయణ మంత్ర హవనం, బలిహరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తి ప్రపత్తులతో గావించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామిని సేవించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం నిత్య హోమం, రథాంగ హోమం, రథ బలి, రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు




హనుమాన్ చాలీసా పారాయణం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని షిర్డీసాయినాథ మందిర వార్షికోత్సవం సందర్భంగా సోమవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామికి అర్చకులు కె.రాఘవేంద్రశర్మ అష్టోత్తర, సహస్రనామాలతో అర్చనలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో పరవస్తు హనుమాన్ సూరి, గీతాభజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్, సాయి చాలీసా పారాయణం గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం దత్తత తీసుకున్న రూరల్ మండల గ్రామం పెదరావూరులో వారం రోజుల ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. తొలిరోజున నేల పరిరక్షణతో మొదలుపెట్టి, రెండోరోజున మొక్కలు నాటారు. తర్వాతిరోజు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. నాలుగోరోజు నుంచి స్వచ్ఛ భారత్, మత్తుపదార్థాలతో కలిగే హానిపై అవగాహన, భూగర్భ జలాల పరిరక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కె.కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.